సాక్షి
అనంతపురం

శనివారం । 1 । జూలై । 2023



చీనీ టన్ను రూ.23 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్టధర రూ.23వేలు పలికాయి.



ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎస్పీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

IIలో

గరిష్టం/కనిష్టం
36.2°/23.4

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది.

తప్పటడుగులు

టీనేజీ పిల్లలను స్మార్ట్‌ఫోన్లు తప్పుదారి పట్టిస్తున్నాయి. మైనర్ అమ్మాయిలను లక్ష్యంగా చేసుకుని కొందరు అబ్బాయిలు చిలిపి చేష్టలతో వల విసురుతున్నారు. వాటికి ఆకర్షితులవుతున్న అమ్మాయిలు అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటున్నారు. అబ్బాయిలు ఇదే అదనుగా అమ్మాయిలతో జంప్ అయిపోతున్నారు. అమ్మాయిలు చేజేతులా చదువును – ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. తల్లిదండ్రులకు తీరని శోకం మిగులుస్తున్నారు.



- మైనర్ అమ్మాయిలే టార్గెట్
- సోషల్ మీడియా ద్వారా అబ్బాయిల ఎర
- ఉచ్చులో పడగానే అమ్మాయిలతో ఇతర రాష్ట్రాలకు జంప్
- ఒక్క ఏడాదిలో 200కు పైగా బాలికల మిస్సింగ్ కేసుల నమోదు
- అమ్మాయిలపై తీవ్ర ప్రభావం చూపుతున్న స్మార్ట్‌ఫోన్‌లు

సాక్షి ప్రతినిధి, అనంతపురం:

❒ నాలుగు రోజుల క్రితం రాప్తాడుకు చెందిన 16 ఏళ్ల అమ్మాయి కదిరి అబ్బాయితో కలిసి వెళ్లిపోయింది. పోలీసులు విచారించగా..ఫేస్‌బుక్ పరిచయమని తేలింది.

❒ అనంతపురంలోని సాయినగర్‌కు చెందిన ఓ యువతి ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది. ఉన్నట్టుండి ఇంట్లో నుంచి అదృశ్యమైంది. ఆరా తీస్తే నగరానికే చెందిన ఓ అబ్బాయితో వెళ్లిపోయింది. వీరిద్దరూ మైనర్లే కావడం గమనార్హం.

మైనర్ అమ్మాయిలే టార్గెట్‌గా కొందరు అబ్బాయిలు గాలమేస్తున్నారు. సామాజిక మాధ్యమాలను ఆసరా చేసుకుని విసురుతున్న ఈ వలలో ఇరుక్కుంటున్న మైనర్ అమ్మాయిల కెరీర్ ధ్వంసమవుతోంది. ఉన్నత చదువులు చదివి స్థిరపడాల్సిన అమ్మాయిలు పదోతరగతి పూర్తి కాకముందే ఆవారా గాళ్ల చేతుల్లో ఇరుక్కుని భవిష్యత్తును నాశనం చేసుకుంటున్న తీరు విస్మయం కలిగిస్తోంది. జిల్లాలో పద్దెనిమిదేళ్లు నిండని అమ్మాయిలు ఏటా 200 మందిపైనే ఇంట్లోనుంచి వెళ్లిపోయినట్టు మిస్సింగ్ కేసుల ద్వారా వెల్లడైంది.

కొంపముంచుతున్న ఫేస్‌బుక్..ఇన్‌స్టా

తల్లిదండ్రులు తమ పిల్లలకు పద్నాలుగేళ్లకే చేతిలో స్మార్ట్‌ఫోన్‌లు పెడుతున్నారు. దీంతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం ఖాతాలు ఓపెన్ చేసుకుంటున్నారు. వీటిద్వారా అబ్బాయిలు సరదాగా మెసేజ్‌లతో మొదలు పెట్టి వారిని తమ వద్దకు రప్పించుకునే వరకు చేస్తారు. అలా మొదలయ్యే వారి పరిచయం ఒంటరిగా కలిసే వరకు వెళుతుంది. చివరకు ఒకరోజు అమ్మాయి తన ఇంట్లో చెప్పకుండా ఆ అబ్బాయితో వెళ్లిపోతుంది. పోలీసులు ఆరా తీస్తే ఇంకేముంది ఫలానా వాడితో వెళ్లిపోయిందనే విషయం తల్లిదండ్రులను కలవరానికి గురిచేస్తోంది.

స్మార్ట్‌ఫోన్‌ల మితిమీరిన ప్రభావం

చక్కగా చదువుకోవాల్సిన సమయంలో అమ్మాయిల చేతికి స్మార్ట్‌ఫోన్‌లు పెట్టడం వల్లే అనర్థాలు జరుగుతున్నట్టు వెల్లడవుతోంది. పలువురు సైకియాట్రిస్టులు, దిశ పోలీసుల వద్దకు కౌన్సెలింగ్‌కు వస్తున్న వారిని చూస్తే ఇవే విషయాలు చెబుతున్నారు. ముఖ పరిచయం కూడా లేకుండా మాధ్యమాల్లో పెట్టే పోస్టింగ్‌లకు ఆకర్షితులు కావడం, ఆ తర్వాత అబ్బాయితో కలిసి వెళ్లడం జరుగుతోంది. 80 శాతం మిస్సింగ్ కేసుల్లో సామాజిక మాధ్యమాల పరిచయంతోనే వెళ్లినట్టు తెలుస్తోంది.

2022లో అమ్మాయిల మిస్సింగ్ కేసులు

వయసు	మిస్సింగ్ కేసులు	ట్రేస్ అయినవి
06-14 ఏళ్లు	25	22
15-18 ఏళ్లు	210	170
19-25 ఏళ్లు	272	227
26-40 ఏళ్లు	94	70

గుర్తింపుకోసం.. పొగడ్తల కోసం



సంవత్సరమంతా చదివి మంచి మార్కులు తెచ్చుకుంటే ఒక్కరోజే గుర్తింపు. ఇలా సామాజిక మాధ్యమాల్లో ఒక పోస్ట్ పెట్టగానే పొగడ్తలు, లైక్‌ల రావడం కోసం తాపత్రయపడతారు. ఇదొక ఫాంటసీగా మారింది. 15 ఏళ్ల నుంచి 16 ఏళ్ల వయసులో ఐడెంటిటీ కోసం బాగా పాకులాడతారు. ఈ క్రమంలో వారు ముఖ పరిచయం లేకపోయినా వారికి పడిపోతారు. ఇలాంటి సమయంలో తల్లిదండ్రులు వారికి స్మార్ట్‌ఫోన్ ఇవ్వకుండా ఉండటం, వారిపై నిఘా ఉంచి కౌన్సిలింగ్ ఇవ్వడం చేయాలి.

– డాక్టర్ విశ్వనాథరెడ్డి, మానసిక వైద్యనిపుణులు

'దిశ' యాప్‌తో రక్షణ



అమ్మాయిలు కానీ, వాళ్ల తల్లిదండ్రులు కానీ 'దిశ' యాప్‌ను స్మార్ట్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఎవరైనా అబ్బాయిలు ఇబ్బంది పెట్టినపుడు సమాచారమందిస్తే తక్షణమే పోలీసులొస్తారు. తల్లిదండ్రులు కూడా పిల్లల ఫోన్ సంభాషణలు, రోజువారీ కార్యకలాపాలపై నిఘా ఉంచాలి. అనుమానం వచ్చిన వెంటనే స్కూల్ టీచర్లను లేదా పోలీసులను సంప్రదిస్తే కౌన్సిలింగ్ చేస్తారు. పిల్లలు మొబైల్ ఫోన్‌లకు బానిసలు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. ఈ వయసులో సరైన మార్గంలో వెళితే మంచి భవిష్యత్తు ఉంటుంది.

– ఆర్‌ఎస్.అమ్మిరెడ్డి, డీఐజీ

ఉత్తమ టీచర్ అవార్డులకు దరఖాస్తు



రాప్తాడురూరల్: జిల్లాలో అన్ని యాజమాన్యాల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్లు, ప్రధానోపాధ్యాయులు 2023 సంవత్సరానికి సంబంధించి జాతీయస్థాయి ఉత్తమ టీచర్ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ఎం.సాయిరామ్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులు కనీసం 10 ఏళ్లు సర్వీస్ పూర్తి చేసి ఉండాలని సూచించారు. దరఖాస్తు కోసం https:nationalawardstoteacher.education.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తును ధ్రువీకరణ అధికారితో ధ్రువీకరించుకుని 15వ తేదీలోగా డీఈఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంలో మరింత తగ్గిన నీరు



బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం (టీబీ డ్యాం)లో నీటిమట్టం మరింత దిగువకు పడిపోయింది. ఎగువన కర్ణాటక ప్రాంతంలో వర్షాలు కురవకపోవడంతో నీటి చేరిక పూర్తిగా ఆగిపోయింది. గత ఏడాది డ్యాంలో ఇదే సమయానికి 1613.61 టీఎంసీల అడుగుల నీటిమట్టంతో 45.202 టీఎంసీల నీరు నిల్వ ఉండి, ఇన్‌ఫ్లో 4,434 కూసెక్కులు, అవుట్‌ఫ్లో 295 క్యూసెక్కులు ఉండేది. ప్రస్తుతం శుక్రవారం నాటికి 3.295 టీఎంసీల నీటి నిల్వతో అవుట్‌ఫ్లో 295 క్యూసెక్కులు నమోదైంది.

హెచ్‌ఎం పదోన్నతులకు జాబితా సిద్ధం

రాప్తాడురూరల్: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న పాఠశాల సహాయకులకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించేందుకు తాత్కాలిక సీనియార్టీ జాబితా సిద్ధం చేసినట్లు డీఈఓ ఎం.సాయిరామ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాను డీఈఓ బ్లాగ్‌లో ఉంచామని, అభ్యంతరాలు ఉంటే రెండో తేదీలోగా సంబంధిత పత్రాలు జతచేసి డీఈఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈ నెల 4న హెచ్‌ఎంల పదోన్నతుల కౌన్సెలింగ్ అనంతపురం సైన్స్ సెంటర్‌లో ఉంటుందని తెలిపారు.

నేటి నుంచి బియ్యం, రాగులు, జొన్నల పంపిణీ



జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: బియ్యం కార్డుదారులకు శనివారం నుంచి జూలై నెల కోటా బియ్యం, రాగులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తారని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. ఈ నెల నుంచి జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల (పట్టణ) పరిధిలోని కార్డుదారులకు గోధుమ పిండి కిలో రూ.16 చొప్పున పంపిణీ చేస్తారన్నారు. బియ్యం కార్డుదారులకు పోషకాలతో కూడిన ఫోర్టిఫైడ్ బియ్యంతో పాటు ఇతర సరుకులు పంపిణీ చేస్తారన్నారు. అదే విధంగా కిలో నుంచి మూడు కిలోల వరకు బియ్యం స్థానంలో రాగులను ఉచితంగా అందిస్తారన్నారు. గుత్తి, పామిడి, పెద్దవడుగూరు, గుంతకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు మండలాల్లో ఒక కిలో బియ్యం బదులగా ఒక కిలో జొన్నలు ఉచితంగా పొందవచ్చన్నారు. ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం, రాగులు, జొన్నలు, నిత్యావసర సరుకులను ఇంటి వద్దకే వచ్చి పంపిణీ చేస్తారన్నారు.

ఈతకు వెళ్లి ఇద్దరు మృత్యువాత




మృతులు షేక్ మహమ్మద్, నబీరసూల్

గుమ్మఘట్ట: ఈత సరదా ఇద్దరిని బలిగొంది. నీట మునిగిన యువకుడు తనను రక్షించబోయిన స్నేహితుడిని భయంతో గట్టిగా పట్టుకోవడంతో ఇద్దరూ ఊపిరాడక ప్రాణం విడిచారు. ఈ ఘటన రెండు ముస్లిం కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. రాయదుర్గానికి చెందిన షేక్ మహమ్మద్ (22) పిండి మిషన్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. బళ్లారిలో టైలరింగ్ పనిచేసుకుంటున్న నబీరసూల్(23) ఇతనికి స్నేహితుడు. బక్రీద్ పండుగ కోసం నబీరసూల్ రాయదుర్గంలోని స్నేహితుడి ఇంటికి వచ్చాడు. శుక్రవారం గుమ్మఘట్ట మండలంలోని భైరవానితిప్ప ప్రాజెక్ట్ చూసి.. సరదాగా నీటిలో ఈత కొడదామని షేక్ మహమ్మద్, నబీరసూల్, మరికొంతమంది స్నేహితులు సోఫిద్, మహమ్మద్, ముజీబ్, వడ్డే బాబుతో కలిసి భోజన క్యారియర్లు తీసుకుని ద్విచక్రవాహనాలపై వెళ్లారు. ఈత రాని నబీరసూల్ అక్కడ నీటిని చూసి సరదాగా దిగాడు. లోతు ఎక్కువగా ఉండటంతో మునిగిపోవడాన్ని గమనించిన షేక్ మహమ్మద్ స్నేహితుడిని రక్షించేందుకని దూకాడు. అయితే నబీరసూల్ భయంతో మహమ్మద్‌ను గట్టిగా పట్టుకున్నాడు. మహమ్మద్‌కు ఈతకొట్టే అవకాశం లేక నబీరసూల్‌తో పాటే నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందారు. తోటి స్నేహితులు రక్షించేందుకు ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. మృత దేహాలను వెలికితీశాక అక్కడికి చేరుకున్న ఇరు కుటుంబాల సభ్యులు గుండెలవిసేలా రోదించారు. మహ్మద్, నబీరసూల్‌లకు వివాహం కాలేదు. సమాచారం తెలుసుకున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి సంఘటన స్థలానికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఫోన్‌లో మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. రూరల్ సీఐ యుగంధర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గార్లదిన్నెకు 'బీమా' పంట



అనంతపురం అగ్రికల్చర్: వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద గార్లదిన్నె మండలానికి అత్యధికంగా రూ.22.23 కోట్లకు పైగా పరిహారం మంజూరైంది. గార్లదిన్నె మండలంలో చీనీ పంట ఎక్కువగా ఉన్నందున పరిహారం పంట పండింది. 2022 ఖరీఫ్‌కు సంబంధించి వాతావరణ బీమా, ఫసల్ బీమా కింద జిల్లాకు రూ.211.80 కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో 31 మండలాలకు చీనీ, పత్తి పంటలకు బీమా వర్తించగా, 17 మండలాల్లో వేరుశనగ పంటకు బీమా ఇచ్చారు. మొత్తం మీద 26,466 మంది చీనీ రైతులకు రూ.101.49 కోట్లు, 82,089 మంది వేరుశనగ రైతులకు 65.60 కోట్లు, 8,260 మంది టమాట రైతులకు రూ.1.43 కోట్లు, పత్తి పంటకు రూ.43.26 కోట్లకు పైగా ఇచ్చారు. ఇందులో గార్లదిన్నె మండలానికి రూ.22.23 కోట్లు, ఆ తరువాత కూడేరు రూ.15.20 కోట్లు, కుందుర్పి రూ.12.80 కోట్లు, రాయదుర్గం రూ.12.38 కోట్లు, కణేకల్లు రూ.12.15 కోట్లు, యల్లనూరు రూ.12.20 కోట్లు, శెట్టూరు రూ.10.43 కోట్లు, గుమ్మఘట్ట రూ.9.15 కోట్లు, అనంతపురం రూ.8.80 కోట్లు, పామిడి రూ.8.48 కోట్లు, కంబదూరు రూ.7.27 కోట్లు, బ్రహ్మసముద్రం రూ.6.81 కోట్లు, తాడిపత్రి రూ.7.02 కోట్లు కేటాయించారు. అలాగే ఆత్మకూరుకు రూ.3.92 కోట్లు, బెళుగుప్ప రూ.4.89 కోట్లు, బొమ్మనహాళ్ రూ.1.26 కోట్లు, బుక్కరాయసముద్రం రూ.3.58 కోట్లు, డీ.హీరేహాళ్ రూ.1.28 కోట్లు, గుత్తి రూ.4.56 కోట్లు, గుంతకల్లు రూ.4.54 కోట్లు, కళ్యాణదుర్గం రూ.6.33 కోట్లు, నార్పల రూ.5.62 కోట్లు, పెద్దపప్పూరు రూ.5.96 కోట్లు, పెద్దవడుగూరు రూ.1.64 కోట్లు, పుట్లూరు రూ.6.17 కోట్లు, రాప్తాడు రూ.4.23 కోట్లు, శింగనమలకు రూ.5.43 కోట్లు, ఉరవకొండ రూ.1.06 కోట్లు, వజ్రకరూరు రూ.1.30 కోట్లు, విడపనకల్లు రూ.3.56 కోట్లు, యాడికి మండలానికి రూ.1.43 కోట్ల పరిహారం మంజూరు చేశారు.

3, 4, 5 తేదీల్లో వర్ష సూచన

అనంతపురం అగ్రికల్చర్ : జిల్లాలో ఈ నెల 3, 4, 5 తేదీల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంటలోని వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సహదేవరెడ్డి, అశోక్‌కుమార్ తెలిపారు.

బడి బాధ్యత మనదే

- సర్కారు స్కూళ్ల నిర్వహణలో పెరిగిన ప్రజల భాగస్వామ్యం
- విద్యాభివృద్ధి పథకాలతో బాధ్యతగా తీసుకుంటున్న తల్లిదండ్రులు
- పేరెంట్స్ కమిటీ సమావేశాలకు 80 శాతానికి పైగా హాజరు



అనంతపురం నగరంలోని ఆర్‌ఎంహెచ్‌ఎస్‌లో ఇటీవల జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు

రాప్తాడు రూరల్: అత్యంత నాణ్యమైన మానవ వనరులను తయారు చేయాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వివిధ విద్యా పథకాలు ప్రజలను ఆకర్షిస్తున్నాయి. ఫలితంగా పాఠశాలల నిర్వహణ, విద్యా పథకాల అమలులో ప్రజల భాగస్వామం గణనీయంగా పెరిగింది. పాఠశాలల పనితీరు, విద్యావ్యాప్తి చెందేందుకు ప్రజల ఈ స్వీయ బాధ్యత ఎంతగానో దోహదపడుతుంది. జిల్లాలోని 1,571 ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల్లో 1-10 తరగతి వరకు 2.20 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. 'జగన్న విద్యా కానుక', 'జగనన్న అమ్మ ఒడి', 'జగనన్న గోరుముద్ద', 'ఇంగ్లిష్ మీడియం చదువు' తదితర పథకాల అమలు నేపథ్యంలో నాలుగేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు గణనీయంగా పెరిగింది.

స్వచ్ఛంద భాగస్వామ్యం

విద్యా పథకాలు సత్ఫలితాలిచ్చిన కారణంగా గతంతో పోల్చితే పాఠశాలల నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం అనూహ్యంగా పెరిగింది. ఇటీవల నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీల సమావేశాలు ఇందుకు తార్కాణంగా నిలిచాయి. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ గడిచిన వారంలో తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించారు. ప్రతి పాఠశాలలోనూ సగటున 80 శాతానికి పైగా హాజరుకావడం శుభసూచకం. గతంలో తల్లిదండ్రుల కమిటీల సమావేశాలు మొక్కుబడిగా జరిగేవి. ఇద్దరు, ముగ్గురిని బలవంతంగా పిలిపించి వారితో రిజిస్టర్‌తో సంతకాలు చేయించుకుని పంపేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది.

తల్లిదండ్రుల చొరవ పెరిగింది

ప్రభుత్వం విద్యాభివృద్ధి పథకాలు, నాడు-నేడు కార్యక్రమం కింద ఒక్కో పాఠశాలకు రూ.లక్షల నుంచి రూ.కోట్లు ఖర్చు చేసి మౌలిక వసతులు కల్పిస్తోంది. ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం బాగా పెరిగింది. ఎవరికి వారు పాఠశాలలకు వచ్చి తమ పిల్లల ప్రోగ్రెస్, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను అడిగి తెలుసుకుంటున్నారు. జేవీకే కిట్లు వందశాతం విద్యార్థులకు చేరేలా ఎంఈఓలు, హెచ్‌ఎంలు, సీఆర్పీలు చూడాలి.

– సాయిరామ్, డీఈఓ

బడులకు పేరెంట్స్ వస్తున్నారు

ప్రభుత్వ బడుల విషయంలో ప్రజల భాగస్వామ్యం స్వచ్ఛందంగా పెరిగింది. ప్రభుత్వ పిలుపు మేరకు బాధ్యతగా తీసుకుని పాఠశాలల్లో జరిగిన సమావేశాలకు హాజరయ్యారు. విద్యా పథకాలకు సంబంధించి అన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న అమ్మ ఒడి, పాఠశాల, మండలస్థాయి సమావేశాలకు ఇంతే స్థాయిలో హాజరవుతున్నారు.

– గోపాలకృష్ణ, అసిస్టెంట్ సీఎంఓ

క్లుప్తంగా

'సమగ్ర సర్వే'పై ఆరా



అధికారులతో మాట్లాడుతున్న కర్నూలు జిల్లా జేసీ నారపరెడ్డి మౌర్య

అనంతపురం అర్బన్: 'వైఎస్సార్–జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష' పథకం కింద చేపట్టిన సమగ్ర భూ సర్వేపై కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య ఆరా తీశారు. సమగ్ర సర్వే తీరును తెలుసుకునేందుకు శుక్రవారం ఆమె జిల్లాకు విచ్చేశారు. సర్వే శాఖ ఏడీ రూప్లానాయక్, జిల్లా ఇన్‌స్పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. పాత ఆర్డీఓ కార్యాలయం వద్ద ఉన్న డేటా సెంటర్‌ను సందర్శించారు. ఓఆర్ఐ (ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్), ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్) ఎలా సిద్ధం చేస్తున్నారో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోనూ సమగ్ర సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలో సర్వే జరుగుతున్న తీరు, అనుసరిస్తున్న విధానాలు తదితర వివరాలను అధికారులతో మాట్లాడి తెలుసుకున్నామన్నారు.

సరి'కొత్త'గా.. మది మురవగా



అనంతపురం రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో కొత్త పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

ఇంటి తరహా భోజనం.. అధునాతనమైన తరగతి గదులు.. కార్పొరేట్ పాఠశాలలను తలపించే వసతులు.. వెరసి ఈ ఏడాది విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలు ఘన స్వాగతం పలికాయి. జగన్ సీఎం అయ్యాక విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ బడులు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచి రూపురేఖలు మార్చారు. విద్యార్థులకు పోషకాలతో కూడిన భోజనం అందించేలా చర్యలు చేపట్టారు. జిల్లాలో ఇప్పటికే యూనిఫామ్, బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. దీంతో పాఠశాలలకు వస్తున్న విద్యార్థులు ఆనందంగా చదువులు కొనసాగిస్తున్నారు. కొత్తగా పంపిణీ చేసిన సామగ్రిని చూసి మురిసిపోతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



అధునాతన తరగతి గదిలో ఆనందంగా..



మధ్యాహ్న భోజనం చేస్తూ..

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, ఆర్డీఓ నిశాంత్ రెడ్డి

కళ్యాణదుర్గం: జూలై 8న దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని కళ్యాణదుర్గంలో జరిగే బహిరంగ సభకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హాజరవుతున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, ఆర్డీఓ నిశాంత్ రెడ్డి, మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ వ్యక్తిగత కార్యదర్శి దేవదాసు తదితరులు సీఎం హెలిప్యాడ్, సభా స్థలిని పరిశీలించారు. హిందూపురం రోడ్డులోని ఖాళీ స్థలాన్ని, జూనియర్ కళాశాల ఆవరణలో క్రీడా మైదానాన్ని పరిశీలించారు.

భారీగా నగదు పట్టివేత!

- కొడికొండ చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న పోలీసులు
- రూ.1.15 కోట్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెల్లడి



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

చిలమత్తూరు: కొడికొండ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం సాయంత్రం భారీ ఎత్తున నగదు పట్టుబడింది! సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో పోలీసులు చెక్‌పోస్టు వద్ద 44వ నంబరు జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలోనే బెంగళూరు వైపు నుంచి వస్తున్న స్కార్పియో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అందులో రూ.1,15,48,500 నగదు పట్టుబడినట్లు హిందూపురం డీఎస్పీ కంజాక్షన్ తెలిపారు. వాహనంలో గల వ్యక్తులు అనంతపురం జిల్లా ఆత్మకూరుకు చెందిన ధనుంజయరెడ్డి, ముత్యాలప్ప, ప్రదీప్‌కుమార్‌లుగా గుర్తించామన్నారు. పండ్లను విక్రయించి డబ్బు తీసుకొస్తున్నట్లు చెప్పారని, కానీ వారి వద్ద ఎలాంటి రసీదులూ లేకపోవడంతో ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగించనున్నట్లు ఆయన చెప్పారు. కాగా.. నగదును ముందస్తు సమాచారం మేరకే పోలీసులు పట్టుకున్నట్లు తెలుస్తోంది. సాయంత్రం పోలీసులు పలువురు మఫ్టీలో చెక్‌పోస్టు వద్ద మకాం వేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ హడావుడిగా కన్పించారు. దీన్నిబట్టి చూస్తే ముందస్తు సమాచారం ఉన్నట్టుగా తెలుస్తోంది.

జేఎన్‌టీయూ (ఏ) ప్రిన్సిపాల్‌గా సత్యనారాయణ

- ఫారిన్ అఫైర్స్ డైరెక్టర్‌గా సుజాత నియామకం
- వర్సిటీ పరిధిలో పలువురు ప్రొఫెసర్ల బదిలీ



ప్రొఫెసర్లు ఎస్వీ సత్యనారాయణ, ఏ. సురేష్ బాబు

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ నియమితులయ్యారు. వర్సిటీ పరిధిలో పలువురు ప్రొఫెసర్లను బదిలీ చేస్తూ వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న ప్రొఫెసర్ పి. సుజాత స్థానంలో కలికిరి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణను నియమించారు.

మార్పు చేర్పులు జరిగిన ప్రొఫెసర్ల వివరాలివీ..

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ప్రొఫెసర్ ఎస్వీసత్యనారాయణ	కలికిరి ప్రిన్సిపాల్	అనంతపురం ప్రిన్సిపాల్
ప్రొఫెసర్ ఎం. వెంకటేశ్వర రావు	కలికిరి ప్రొఫెసర్	కలికిరి ప్రిన్సిపాల్
ప్రొఫెసర్ ఏ. సురేష్‌బాబు	సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్	డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ఆడిట్
ప్రొఫెసర్ బి. ఈశ్వర్ రెడ్డి	అడ్మిషన్స్ డైరెక్టర్	రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్
ప్రొఫెసర్ పి. సుజాత	అనంతపురం ప్రిన్సిపాల్	ఫారిన్ అఫైర్స్ డైరెక్టర్
ప్రొఫెసర్ ఆర్. కిరణ్మయి	ఫారిన్ అఫైర్స్ డైరెక్టర్	అడ్మిషన్స్ డైరెక్టర్
ప్రొఫెసర్ సి. శోభాబిందు	రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్	సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్
ప్రొఫెసర్ విజీ చిత్ర	ఇంగ్లిష్ ప్రొఫెసర్	డైరెక్టర్, మహిళా సాధికారిత
ప్రొఫెసర్ ఆర్.భువన విజయ	డైరెక్టర్ మహిళా సాధికారిత	సైన్స్, హ్యుమానిటీస్ డైరెక్టర్
ప్రొఫెసర్ ఎం. నసీరా	కలికిరి ప్రొఫెసర్	వైస్ ప్రిన్సిపాల్, కలికిరి
ప్రొఫెసర్ ఈ. అరుణ కాంతి	ప్రొఫెసర్	వైస్ ప్రిన్సిపాల్, అనంతపురం
డాక్టర్ ఎస్. చంద్రమోహన్ రెడ్డి	ప్రొఫెసర్	అనంతపురం ఈసీఈ విభాగాధిపతి
డాక్టర్ ఎం. రామశేఖర్ రెడ్డి	అడిషనల్ కంట్రోలర్	అనంతపురం ఈఈఈ విభాగాధిపతి
డాక్టర్ జితేంద్ర గౌడ్	అడిషనల్ కంట్రోలర్	కలికిరి ఈఈఈ విభాగాధిపతి
బి. అజిత	అసిస్టెంట్ ప్రొఫెసర్	సివిల్ విభాగాధిపతి
డాక్టర్ జే. శ్రీనివాసులు	ఈఈఈ విభాగాధిపతి	అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్
డాక్టర్ జి. మురళి	ప్రొఫెసర్	పులివెందుల సీఎస్ఈ విభాగాధిపతి
డాక్టర్ ఎస్.జస్పికా సరిత	పులివెందుల సీఎస్ఈ విభాగాధిపతి	అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్
ప్రొఫెసర్ ఆర్.భవానీ	అనంతపురం వైస్ ప్రిన్సిపాల్	పులివెందుల కళాశాలకు డిప్యుటేషన్
ఎస్.శ్రీధర్	అడిషనల్ కంట్రోలర్	కలికిరి కళాశాలకు డిప్యుటేషన్
ప్రొఫెసర్ ఎన్.విశాలి	ఈఈఈ విభాగాధిపతి	కలికిరి కళాశాలకు డిప్యుటేషన్
డాక్టర్ డీ.ఆర్.శ్రీనివాసన్	మెకానికల్ ప్రొఫెసర్	కలికిరి కళాశాలకు డిప్యుటేషన్
డాక్టర్ కే. అపర్ణ	ప్రొఫెసర్	కలికిరి ఈసీఈ విభాగాధిపతి

వ్యక్తి ఆత్మహత్య

బొమ్మగుప్ప: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి కుటుంబసభ్యులు మందలించడంతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని తగ్గుపర్తిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రామకృష్ణయ్య తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన ఎర్రిస్వామి (54), పద్మావతి దంపతులు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ఉద్యోగరీత్యా తల్లి, సోదరితో కలిసి అనంతపురంలో ఉంటున్నారు. ఎర్రిస్వామి మాత్రం స్వగ్రామంలో ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు శుక్రవారం మందలించగా.. తీవ్ర మనస్తాపం చెందిన ఆయన గ్రామ సమీపంలోని పొలంలో మద్యంలో విషపు గుళికలు వేసి తాగాడు. కుటుంబ సభ్యులకు ఫోన్‌లో విషయం తెలిపాడు. వారు గ్రామస్తులకు సమాచారం అందించడంతో హుటాహుటిన అనంతపురం తరలించగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఎర్రిస్వామి మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరికి మూడేళ్ల జైలు

గార్లదిన్నె: ఓ వ్యక్తి ఆత్మహత్య కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష పడింది. హెడ్ కానిస్టేబుల్ చౌరెడ్డి తెలిపిన మేరకు.. 2015 సంవత్సరంలో ఉమాదేవి భర్త రవిశంకర్ తమ ఇంటిని పి.కొత్తపల్లికి చెందిన క్రిష్టారెడ్డి రూ.2,70,000కు రిజిస్ట్రేషన్ ఆయకం చేయించుకున్నారు. ఇల్లు విడుపించుకోమని క్రిష్టారెడ్డి బలవంతం చేయడంతో రవిశంకర్ పురుగుల మందు తాగి చనిపోయాడు. అప్పట్లో గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ వేశారు. శుక్రవారం జడ్జీ దీనా విచారణ చేసి పి.కొత్తపల్లికి చెందిన కృష్టారెడ్డి, చలమావతికి మూడేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున జరిమానా విధించారు. మరో ముగ్గురిపై కేసు నిరూపణ కాకపోవడంతో విడుదల చేశారు.

2న ఈడిగ విద్యార్థులకు పురస్కారాలు

రాప్తాడురూరల్: జిల్లాలో పదో తరగతి, ఇంటర్‌లో (2022–23) ప్రతిభ చాటిన ఈడిగ (గౌడ) విద్యార్థులకు ఈనెల 2న పురస్కారాలు అందజేయనున్నట్లు ఈడిగ (గౌడ) ఉద్యోగ సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు ఈజీ నాగభూషణం, ప్రధానకార్యదర్శి వై.ఆదిశేషయ్య శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2న ఉదయం 10 గంటలకు అనంతపురం నగర శివారులోని రేణుకా యల్లమ్మ ఆలయం ఈడిగ భవన్‌లో కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులతో పాటు జిల్లా వ్యాప్తంగా ఈడిగ కులస్తులు, ఉద్యోగులు, కల్లుగీత కార్మికులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రశాంతంగా బదిలీ ప్రక్రియ



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఈ భాగ్యరాజ్

అనంతపురం సిటీ: గ్రామ సచివాలయాల్లో పని చేసే ఇంజినీరింగ్ అసిస్టెంట్ల రెండో విడత బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రశాంతంగా నిర్వహించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు అనంతపురంలోని పంచాయతీరాజ్ శాఖ జిల్లా కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ యమ్మాని భాగ్యరాజ్, ఈఈ మురళీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి, రసూల్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 200 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కౌన్సెలింగ్‌కు తరలివచ్చారు. వారిలో 16 మందికి అంతర్ జిల్లాల బదిలీలు చేశారు. ముగ్గురికి మెడికల్ గ్రౌండ్ కింద బదిలీలు చేయగా, సుమారు 100 మందికి అనంతపురం జిల్లాలో బదిలీలు నిర్వహించారు. మరో 40–50 మందికి తాము కోరుకున్న చోట ఖాళీలు లేకపోవడంతో వారిని పాత స్థానాల్లోనే కొనసాగాలని సూచించారు. బదిలీలైన వారికి వెంటనే ఉత్తర్వులు కూడా అందజేశారు. జూలై ఒకటి నుంచి బదిలీ అయిన ప్రాంతంలో విధుల్లో చేరాలని ఆదేశించారు.

మంత్రాలయం ప్యాసింజర్ రైళ్ల సేవలు పొడిగింపు

గుంతకల్లు: గుంతకల్లు–మంత్రాలయం ప్యాసింజర్ రైళ్ల సేవలు పొడిగించినట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు–మంత్రాలయం (07411) ప్యాసింజర్ ఈ నెల 10 వరకూ, మంత్రాలయం–గుంతకల్లు (07412) ప్యాసింజర్ 11వ తేదీ వరకూ రాకపోకలు సాగిస్తాయన్నారు.

జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు వీరే..

- కేంద్ర కార్యాలయం జాబితా విడుదల

అనంతపురం క్రైం: జిల్లాలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు జేసీఎస్ మండల , వార్డుల ఇన్‌చార్జ్‌లను ఏర్పాటు చేసిన విషయం విదితమే. వైఎస్సార్ సీపీ కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన ఆయా ఇన్‌చార్జ్‌ల జాబితాను విడుదల చేసింది.

అనంతపురం: చింత సోమశేఖర్ రెడ్డి, చింతకుంట మధు, కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, బోయ లక్ష్మణ్ణ, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి.

కళ్యాణదుర్గం: కే చంద్రశేఖర్ రెడ్డి, హెచ్.ఆంజనేయులు, వై.అర్చన కుమారి, ఎస్.గంగాధర, ఈ.రాము, పీ.తిమ్మరాజు.

గుంతకల్లు: సుభాష్‌రెడ్డి, ఎం.రంగస్వామి, కే. గోవింద్ నాయక్, జింకల రామాంజనేయులు, ఖలీల్, కుమార్ రెడ్డి, బీ. ఆసిఫ్.

రాయదుర్గం: రామాంజనేయులు, రాళ్ల తిమ్మారెడ్డి, పీ.సుధాకర్ రెడ్డి, బీ.హనుమంత రెడ్డి, గొళ్ల మురహరి, వై.సిద్దేశ్వర.

శింగనమల: సీ.బయపరెడ్డి, ఎం.ధనుంజయ, వీ.రాజకుల్లాయ్ రెడ్డి, ఆర్.నాగేశ్వర రావు, పీ.వెంకటరామయ్య, జీ.ప్రభాకర్ రెడ్డి.

తాడిపత్రి: యర్రగుడి పెద్దిరెడ్డి, బట్టా వేణుగోపాల్, రామిరెడ్డి గారి చంద్రఓబుళ రెడ్డి, కంచం రామమోహన్ రెడ్డి, జీ. రవిజేత రెడ్డి, తెల్లకుల శివప్రసాద్.

ఉరవకొండ: ఆసిఫ్, టీ.రామాంజనేయులు, బీ.మస్తాన్, టీ. రామాంజినేయులు, ఎస్.దేవేంద్ర, బీ.తేజోనాథ్, రచన గౌడ్, భారతి రెడ్డి.

జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

అనంతపురం: జిల్లా క్రికెట్ (సీనియర్) జట్టును ఎంపిక చేశారు. జులై 1 నుంచి 19 వరకూ జరగనున్న ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్ జోన్ సీనియర్ అంతర జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో ఈ జట్టు ప్రాతినిధ్యం వహిస్తుంది.

ఎంపికైన జట్టు సభ్యులు వీరే: డీబీ ప్రశాంత్ కుమార్ (కెప్టెన్), షోయబ్ ఖాన్ (వైస్ కెప్టెన్), ఎంకే దత్తా రెడ్డి, పి. గిరినాథ రెడ్డి, జి. సంపత్ కుమార్, ఎస్. మహబూబ్ పీరా, బి. ఖాదర్ వలి, బి. యోగానంద, బి. సంతోష్, ఎం. దీపక్, బి. వినయ్ కుమార్, ఎం. రాజు కుళ్లాయప్ప, జి. మల్లిఖార్జున, ఎస .ఎం. ఖలీల్, టి. మహేంద్ర రెడ్డి, రోహిత్ రోషన్, ఎం. సాయి కృష్ణ

2న జిల్లా స్థాయి మహిళా క్రికెట్ జట్ల ఎంపిక

అనంతపురం ఆర్డీటీ క్రీడా గ్రామంలో జులై 2న అండర్–15, అండర్ –19 జిల్లా స్థాయి మహిళా క్రికెట్ జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రెటరీ కే. మధు ఆచారి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఆధార్, స్టడీ సర్టిఫికెట్, ఒరిజనల్ సర్టిఫికెట్‌లతో హాజరుకావాలని సూచించారు.

ఎండిన ద్రాక్ష తిని 20 గొర్రెల మృతి



మృతి చెందిన గొర్రెలు

గార్లదిన్నె: తోటలో ఎండిపోయిన ద్రాక్ష తిని 20 గొర్రెలు మృత్యువాత పడిన ఘటన మండల పరిధిలోని తిమ్మంపేట సమీపంలో చోటుచేసుకుంది. రామగిరి మండలం కుంటిమద్దికి చెందిన బిల్లే శ్రీరాములు తన 300 గొర్రెలను మేపు కోసం గార్లదిన్నె మండలం తిమ్మంపేటకు తీసుకొచ్చాడు. శుక్రవారం ఉదయం స్థానికంగా ఉండే ఓ తోటలో ఎండిన ద్రాక్షలను గొర్రెలు తిన్నాయి. కొంతసేపటికి నీరు తాగి కడుపు ఉబ్బరంతో పడిపోయాయి. సమాచారం అందుకున్న పశువైద్యాధికారి రమేష్ తన సిబ్బందితో హుటాహుటిన వెళ్లి కొన ఊపిరితో ఉన్న దాదాపు వంద గొర్రెలకు సెలైన్ బాటిళ్లు ఎక్కించారు. అప్పటికే 20 గొర్రెలు ప్రాణాలు విడిచాయి. దీంతో దాదాపు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. కళేబరాలను గొర్రెల, మేకల కార్పొరేషన్ చైర్మన్ నరసింహ గౌడ్, జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. బాధిత రైతును ఓదార్చారు. నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

ఇంట్లో చోరీ



బీరువాను ధ్వంసం చేసిన దొంగలు

ఉరవకొండ: మండలకేంద్రంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఉరవకొండ అర్బన్ సీఐ హరినాథ్ తెలిపిన మేరకు.. స్థానిక లక్ష్మీనృసింహస్వామి కాలనీలో ఆర్టీసీ డ్రైవర్ మహబూబ్‌బాషా నివాసముంటున్నారు. బక్రీద్ చేసుకునేందుకు కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 27న సొంతూరు పామిడికి వెళ్లారు. శుక్రవారం ఉదయం తిరిగి ఇంటికి రాగా, తలుపు తాళాలు పగులగొట్టిన స్థితిలో కనిపించాయి. బీరువాలోని రూ. 3 లక్షలతో పాటు 2 తులాల బంగారం కనిపించలేదు. బాధితుని సమాచారంతో పోలీసులు ఇంటిని పరిశీలించారు. క్లూజ్‌టీం సభ్యులు వేలిముద్రలు సేకరించారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎస్పీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. విద్యలో ప్రతిభ కనబరిచిన పోలీసు పిల్లలు 71 మందికి రూ.4,39,500 మెరిట్ స్కాలర్ షిప్‌లను స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో చేపట్టిన ఈ కార్యక్రమం బృహత్తరమైందన్నారు. ప్రతిభ గల విద్యార్థులను మెరిట్ స్కాలర్ షిప్‌తో సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, మంచి అలవాట్లు, మంచి లక్ష్యంతో ముందుకు వెళితే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తెరిగి బాగా చదవాలన్నారు. లక్ష్యం చేరేదాకా విశ్రమించరాదని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్. విజయ భాస్కరరెడ్డి, ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఆర్టీ ఉద్యోగాలకు నైపుణ్య పరీక్ష రేపు

రాప్తాడురూరల్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న సీఆర్టీ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా ఈనెల 2న అభ్యర్థులకు నైపుణ్య పరీక్ష (స్కిల్ టెస్ట్) ఉంటుందని సమగ్ర శిక్ష ఏపీఓ, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 1:3 ప్రకారం ఎంపికై దరఖాస్తుల పరిశీలన పూర్తయిన అభ్యర్థులు మాత్రమే హాజరుకావాల్సి ఉంటుదని స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో అనంతపురంలోని రాజేంద్ర మునిసిపల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 2.30 గంటలకు నైపుణ్య పరీక్ష జరుగుతుందని వెల్లడించారు. పీజీటీ (పీఎస్‌టీటీ), పీజీటీ (ఏటీఅండ్‌టీ), పీజీటీ (జీఎఫ్‌సీ), పీజీటీ (ఎంఎల్‌టీ), పీజీటీ (ఎంపీహెచ్‌డబ్ల్యూ) సబ్జెక్టుల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు.

క్లుప్తంగా

ఆవోపాలో 'గోరింట' పండుగ



అమ్మవారికి గోరింటను సమర్పిస్తున్న ఆర్యవైశ్య మహిళలు

అనంతపురం కల్చరల్: ఆషాఢమాస సంప్రదాయాలను ఆర్యవైశ్య మహిళలు నియమ నిష్టలతో పాటించారు. శుక్రవారం స్థానిక రాజురోడ్డులోని వైశ్యాహాస్టల్ ప్రాంగణంలో ఆవోపా (ఆర్యవైశ్య ఆఫీసర్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) మహిళా విభాగం అధ్యక్షురాలు గుడూరు అనురాధ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళలు వాసవీ మాతకు అలంకరణ సేవలు చేసి, పూజలు చేశారు. అనంతరం సామూహిక గోరింటాకుతో భక్తిగీతాలనాలపిస్తూ అమ్మవారిని స్తుతించారు.

ఆర్థికసాయం

ఆత్మకూరు: మండల కేంద్రానికి చెందిన ఎద్దుల సన్నప్పయ్య అనారోగ్యంతో బాధపడుతుండడంతో హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ ద్వారా యువకులు శుక్రవారం రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు.

శాకంబరి అలంకరణలో అమ్మవారు



శాకంబరి అలంకరణలో పెద్దమ్మ తల్లి

అనంతపురం కల్చరల్: నగరంలో పలు చోట్ల ఆషాఢమాసంలో వచ్చిన శుక్రవారం అమ్మవారి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. బోయవీధిలో పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించారు. వాసవీ గోవింద భజన మండలి వారు ఆళ్లగడ్డ రాము ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక భజనలు, భక్తిగీతాలాపనలు జరిగాయి. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో, పాతూరు చెరువుకట్టపై వెలసిన నిముషాంబాదేవి ఆలయాల్లో అమ్మవారు ప్రత్యేక అలంకార సేవల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

నాణ్యమైన భోజనం అందించండి

• అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కళ్యాణ చక్రవర్తి




ఆర్ట్స్ కళాశాల హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్

అనంతపురం క్రైం: విద్యార్థులకు సురక్షిత ప్రమాణాలు పాటించి, నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని వార్డెన్లను అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కళ్యాణ చక్రవర్తి సూచించారు. జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశాలతో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కళ్యాణ చక్రవర్తి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ తస్లీం ఆర్ట్స్ కళాశాల హాస్టల్, సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్, డీఆర్‌డీఏ ఆఫీస్ వద్ద ఉన్న హాస్టల్స్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నారా? అని పరిశీలించారు.

'మేనిఫెస్టోపై మాట్లాడే అర్హత టీడీపీకి లేదు'

అనంతపురం క్రైం: మేనిఫెస్టోపై మాట్లాడే అర్హత టీడీపీకి లేదని మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గౌస్ బేగ్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇటీవల టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోపై చేసిన విమర్శలను వారు తప్పుపట్టారు. వారు మాట్లాడుతూ 2014 ఎన్నికల ముందు టీడీపీ 650 హామీలు ఇచ్చి, వాటిని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలను 99 శాతం నెరవేర్చారన్నారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మారుతీనాయుడు పాల్గొన్నారు.

శిల్పారామంలో బక్రీద్ వేడుకలు



నృత్యాలు చేస్తున్న చిన్నారులు

అనంతపురం రూరల్: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని శిల్పారామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మక్బూల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారులు నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో శిల్పారామం ఏఓ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

కమిషనర్ సెలవు పొడిగింపు

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి మెడికల్ లీవును పొడిగించారు. శనివారం నుంచి 9వ తేదీ వరకూ సెలవు కొనసాగించారు. అంత వరకూ ఎఫ్ఏసీ కమిషనర్‌గా రమణారెడ్డి కొనసాగనున్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేద్దాం



కమిషనర్ రమణారెడ్డితో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: 'జగనన్న సురక్ష'ను విజయవంతం చేద్దామని మేయర్ వసీం అధికారులను ఆదేశించారు. జగనన్న సురక్ష క్యాంపులు జరిగే మూడు సెంటర్లను డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కమిషనర్ రమణారెడ్డి, డిప్యూటీ కమిషనర్ సావిత్రి, కార్యదర్శి సంగం శ్రీనివాసులతో కలసి మేయర్ పరిశీలించారు. సురక్ష క్యాంపులో ఏర్పాటు చేయనున్న పోస్టర్లు, సర్టిఫికెట్లను మేయర్ పరిశీలించారు. అర్హులందరికీ సంక్షేమం: మేయర్ మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమం అందించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పమన్నారు. సాంకేతిక కారణాలతో పథకాలు అందని లబ్ధిదారులను గుర్తించడంతోపాటు ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను ఇవ్వడానికి ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. జూలై 1న కోర్టు రోడ్డులోని 26వ సచివాలయం, క్లాక్‌టవర్ వద్ద ఉన్న 22వ సచివాలయం, ఎంజీ కాలనీలోని 2వ సచివాలయంలో క్యాంపులను ఏర్పాటు చేసి లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందించనున్నట్లు తెలిపారు. కార్పొరేటర్లు గుడూరు మల్లికార్జున, అబూసలేహా, అనిల్‌కుమార్ రెడ్డి, నాయకులు రామాంజనేయులు పాల్గొన్నారు.

నేడే 'జగనన్న సురక్ష'

అనంతపురం క్రైం: నగరంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం శనివారం జరగనుంది. నగరంలోని 26వ సచివాలయం, 22వ సచివాలయం, 2వ సచివాయాల్లో ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభంకానుంది. 26వ సచివాలయంలో ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు పాల్గొని, కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. 22, 23, 24, 25, 26,27,28, 1, 2 సచివాలయాల పరిధిలోని ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న 11 రకాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొత్తం 2683 ఫిర్యాదులు అందాయని, ఫిర్యాదు చేసిన ప్రతి ఒక్కరూ కార్యక్రమానికి హాజరుకావాలన్నారు.

సీజనల్ వాధులపై అప్రమత్తం చేయాలి..

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చైతన్యం తీసుకురావాలని పారిశుధ్య కార్యదర్శులను కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా పారిశుధ్య కార్యదర్శులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. డెంగీ, మలేరియా, తదితర దోమకాటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యం మెరుగునకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వేకువజామున 5 గంటలకే విధులకు హాజరుకావాలన్నారు. యూజర్ చార్జీలను వసూలు చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. మలేరియా బృందంతో సమన్వయం చేసుకొని ఫాగింగ్ చేయించాలన్నారు.

నేడు బి.యాలేరులో 'జగనన్న సురక్ష'

ఆత్మకూరు: మండలంలోని బి.యలేరులో శనివారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల ప్రత్యేక అధికారి రఘునాథ్‌రెడ్డితో కలసి గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడుతూ కుల,ఆదాయ, జనన,మరణ ధ్రువపత్రాలతోపాటు 11 రకాల సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మండల స్థాయి అధికారులు గ్రామంలోనే ఉంటారన్నారు. సనప, వేపచెర్ల గ్రామాల్లో ఇంటింటా జగనన్న సురక్ష కార్యక్రమంలో భాంగా సర్వే చేశారు.

గ్రామాల్లో ప్రశాంత జీవనం సాగించాలి

• డీఎస్పీ వెంకటశివారెడ్డి



పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటశివారెడ్డి

ఆత్మకూరు: గ్రామాల్లో కక్షలు, గొడవలకు పోకుండా ప్రశాంత జీవనం సాగించేలా గ్రామ సభలు ఏర్పాటు చేసి, ప్రజలకు తెలియజేయాలని సిబ్బందికి డీఎస్పీ వెంకట శివారెడ్డి సూచించారు. శుక్రవారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రజలకు సూచనలు ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఎలాంటివారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ జనార్దన్ పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో బీమా జాబితా ప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ రవికుమార్

ఆత్మకూరు: ఆర్‌బీకేల్లో పంటల బీమా జాబితాలు ప్రదర్శించినట్లు ఏడీఏ రవికుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ జాబితా అతికించారు. ఆత్మకూరు రైతు భరోసా కేంద్రంలో ఏడీఏ రవికుమార్ రైతులతో, వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఏడీఏ మాట్లాడుతూ మండలంలో చీనీ రైతులకు, పత్తి రైతులకు మాత్రమే ఈ ఏడాది ఇన్‌పుట్ సబ్సిడీ వర్తించిదన్నారు. మండల వ్యాప్తంగా 3,938 ఎకరాలకు చీనీ రైతులకు గాను రూ.3.93 కోట్లు, పత్తి పంటకు 279 ఎకరాలకు గాను రూ.2.45 లక్షలు మంజూరయ్యిందన్నారు. చీనీ రైతులకు ఎకరాకు రూ.10 వేలు, పత్తి రైతులకు ఎకరాకు రూ.880 వర్తిస్తుందని తెలిపారు.
మండల వ్యాప్తంగా 18 వేల మంది రైతులున్నారని, వేరుశనగ, కంది, ఆముదం తదితర పంటలకు ఇన్సూరెన్స్ రాలేదని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఏడీఏ దృష్టికి తీసుకెళ్లారు. చీనీ, పత్తి రైతులు ఈ క్రాప్ చేయించి జాబితాలో పేరు లేకుంటే 4వ తేదీలోపు రైతు భరోసా కేంద్రాల్లో జిరాక్సులు ఇవ్వాలని ఏడీఏ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాల పోతన్న, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, నాయకులు ఫణిరెడ్డి, రుషిరెడ్డి, వన్నూరప్ప, వెంకట్రామిరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, పడిగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం వచ్చింది.. సర్టిఫికెట్ ఇవ్వలేదని నిరసన



పాలకభవనం ముందు ఆందోళన చేస్తున్న సుబ్బరాయ ఆచారి

అనంతపురం: టీసీఎస్ (టాటా కన్సెల్టెన్సీ సర్వీసెస్) కంపెనీలో ఐదు అంకెల వేతనంతోతో కొలువు దక్కింది. ఉద్యోగంలో చేరడానికి స్నాతకోత్సవ సర్టిఫికెట్ అనివార్యం అయింది. దీంతో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి వచ్చి స్నాతకోత్సవ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరడంతో ఉన్నతాధికారులు ససేమిరా అన్నారని కే సుబ్బరాయ ఆచారి అనే పూర్వ విద్యార్థి ఆవేదన వ్యక్తం చేశాడు. 21వ స్నాతకోత్సవ నోటిఫికేషన్ ఇచ్చారు. జూలై 17న స్నాతకోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఇన్‌అడ్వాన్స్‌డ్ కింద సర్టిఫికెట్‌లు ఇవ్వలేమని పరీక్షల విభాగం అధికారులు పేర్కొన్నారు. టీసీఎస్ కంపెనీలో ఏడాదికి రూ.9 లక్షల వేతనం వచ్చే ఉద్యోగం వచ్చిందని తెలిపినా వర్సిటీ అధికారుల మొండి వైఖరితో ఉద్యోగం కోల్పోవాల్సి వస్తోందని విద్యార్థి ఎస్కేయూ పాలకభవనం ముందు శుక్రవారం ఆందోళన చేశాడు. జరిమానాతో సహా చెల్లిస్తాను.. తనకు సర్టిఫికెట్ ఇవ్వాలని ప్రాధేయపడినా ఉన్నతాధికారులు కనికరించలేదన్నాడు. కనీసం ఉన్నతాధికారులు అయినా స్పందించి స్నాతకోత్సవ సర్టిఫికెట్ వచ్చేలా చొరవ చూపాలని బాధితుడు కోరుతున్నాడు.

ఒకరికి గాయాలు

ఆత్మకూరు : ఆత్మకూరు సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. ఎస్ఐ జనార్దన్ తెలిపిన మేరకు..అనంతపురానికి చెందిన లలిత, తిమ్మరాయుడు కంబదూర్ మండలం ములకనూర్ నుంచి తిరిగి అనంతపురానికి కారులో వస్తుండగా, ఆత్మకూరు వద్దకు రాగానే ముందు వెళ్తున్న ఐచర్ వాహనాన్ని దాటే క్రమంలో ఎదురుగా మరో వాహనం వచ్చింది. దాన్ని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొని కారు కొంతదూరంలో గుంతలో పడింది. కారులో ప్రయాణిస్తున్న లలిత అనే మహిళకు గాయాలయ్యాయి.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

• ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి



ప్రొఫెసర్లను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం: ఏ ఉద్యోగమైనా అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు లభిస్తుందని ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి అన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రెక్టార్ ప్రొఫెసర్ ఏ మల్లికార్జున రెడ్డి , బోటనీ ప్రొఫెసర్ తిమ్మానాయక్, కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ కే సుధాకర్ బాబు శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై వారిని సత్కరించారు. వీసీ మాట్లాడుతూ ప్రొఫెసర్ ఏ మల్లికార్జున రెడ్డి 1990లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కెరీర్‌ను ప్రారంభించి, అంచెలంచెలుగా ఎదిగి, వర్సిటీ పురోగతికి అంకితభావంతో కృషి చేశారన్నారు. రెక్టార్‌గా , రిజిస్ట్రార్‌గా, సీడీసీ డీన్‌గా విశిష్టమైన సేవలు అందించారని ప్రశంసించారు. ప్రొఫెసర్ తిమ్మానాయక్ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా సమర్థవంతంగా పనిచేశారన్నారు. 2003లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా కెరీర్‌ను ప్రారంభించి కీలకమైన బాధ్యతలు నిర్వర్తించారన్నారు. ప్రొఫెసర్ కే సుధాకర్ బాబు 1998లో లెక్చరర్‌గా కెరీర్‌ను ప్రారంభించి, వివిధ హోదాల్లో పనిచేశారన్నారు. కెమిస్ట్రీ విభాగాధిపతిగా, బోర్డ్‌ఆఫ్ స్టడీస్ చైర్మన్, రిజిస్ట్రార్‌గా, పాలకమండలి సభ్యులుగా వర్సిటీకి సేవలు అందించారన్నారు. వర్సిటీ సూపరింటెండెంట్ లక్ష్మీకరబాబు, రామకృష్ణ, వెంకటరమణ, లింగమయ్య, లీలావతి పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా వీరందరినీ వీసీ అభినందించారు. ఎస్కేయూ రెక్టార్, మేథమేటిక్స్ విభాగం ప్రొఫెసర్ మల్లికార్జున రెడ్డిని సత్కరించారు. మేథమేటిక్స్ పూర్వ ప్రొఫెసర్లు, పూర్వ విద్యార్థులు, పరిశోధన విద్యార్థులు సన్మానించారు.
= అనంతరం డీఆర్‌డీఏ సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న జి. ఆదిలక్ష్మమ్మ శుక్రవారం పదవీ విరమణ చేశారు. డీఆర్‌డీఏ సిబ్బంది తదితరులు సత్కరించారు.

గణితం లేనిదే ఇంజనీరింగ్ లేదు

అనంతపురం: గణితం ఇంజనీరింగ్ సబ్జెక్టుకు తల్లి వంటిదని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య అన్నారు. ఎస్కేయూలోని మేథమేటిక్స్ విభాగంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

సీడీసీ నూతన డీన్‌గా రామ్‌గోపాల్

ఎస్కేయూ సీడీసీ (కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్) నూతన డీన్‌గా ప్రొఫెసర్ కే.రామ్‌గోపాల్ నియమితులయ్యారు. ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రొఫెసర్ కే. రామ్‌గోపాల్ ప్రస్తుతం ఎస్కేయూ పీఆర్వోగా, పాలిమర్ సైన్స్ విభాగాధిపతిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇస్రో (భారత అంతరిక్ష పరిశోధన సంస్థ) ఆధ్వర్యంలో రూ.8.5 కోట్లతో నిర్వహిస్తున్న ప్రాజెక్టుకు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్‌గా ఉన్నారు. ఇప్పటి వరకూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 180కి పైగా పరిశోధన పత్రాలను ప్రచురించారు. 16 మందికి పీహెచ్‌డీలు ఆయన పర్యవేక్షణలో ప్రదానం చేశారు. బోధన, పరిశోధనల్లో విస్తృతమైన అనుభవం ఉండడంతో సీడీసీ డీన్‌గా ఎంపిక చేశారు. రెండు సంవత్సరాల పాటు ఆయన డీన్ బాధ్యతలు నిర్వర్తిస్తారు.

పేదలకు ఇళ్లు ఇస్తుంటే కడుపుమంట

• ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల మండిపాటు



మాట్లాడుతున్న ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల

అనంతపురం సెంట్రల్: పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తుంటే చంద్రబాబునాయుడు, ఆయనకు కొమ్ముకాస్తున్న ఈనాడు రామోజీరావుకు కడుపు మంట వస్తోందని ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల మండిపడ్డారు. శుక్రవారం ఆమె చాంబర్‌లో మీడియాతో మాట్లాడారు. పేదల ఇళ్లపై అసత్య కథనాలు వండివారుస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో లక్షలాది మంది నిరుపేదలకు స్థలాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించి ఇస్తున్నారని వివరించారు. అనేక ప్రాంతాల్లో ఊర్లే నిర్మిస్తున్నట్లు తెలిపారు. దళితద్రోహి చంద్రబాబు కొమ్ముకాస్తున్న ఎల్లో మీడియా అసత్య కథనాలు ప్రచురిస్తే నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో బడుగు,బలహీన వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. దళిత కుటుంబంలో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా? అని చంద్రబాబు అన్న విషయాన్ని గుర్తు చేశారు. గత టీడీపీ హయాంలో అనేక మంది దళితులను పొట్టన పెట్టుకున్నారని, దాడులకు పాల్పడ్డారని వివరించారు. గత ఎన్నికల్లో దళితులంతా ఏకమై టీడీపీని భూస్థాపితం చేశారని, వచ్చే ఎన్నికల్లో కూడా పునరావృతం అవుతుందని హెచ్చరించారు.

ముస్లిం మైనార్టీల వంచకుడు చంద్రబాబే



ముస్లిం మత పెద్దలతో మేయర్ వసీం తదితరులు

అనంతపురం సిటీ: ముస్లిం మైనార్టీలను వంచించిన నీచుడు చంద్రబాబే అని మేయర్ వసీం, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ అన్నారు. వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు పార్టీ అనుబంధ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్ ఆధ్వర్యంలో నగరంలోని మరవకొమ్మ కొట్టాలలోని మసీదు-ఏ-ఖాద్రియా మసీద్‌లో 'హర్ దిల్ మే వైఎస్సార్-హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం అక్కడి మసీద్‌లో మత పెద్దలు, మసీద్ కమిటీ సభ్యులు, ముస్లింలతో వారు మాట్లాడారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు రెండు నాలుకల ధోరణిని తప్పుబట్టారు. తన హయాంలో ఒక్క ముస్లింకూ మంత్రి పదవి ఇచ్చిన పాపాన పోలేదని నిప్పులు చెరిగారు. సీఎం వైఎస్ జగన్ ముస్లిం మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యం ఇచ్చారని, ముస్లింల అభ్యున్నతికి పాటుపడుతున్నారన్నారు. కార్పొరేటర్ ఇషాక్, నాయకులు షెక్షావలి, బాషా, జిలాన్, ఇమామ్ అబూబకర్, ముతవల్లి హబీబ్, సభ్యులు ఖాదర్‌బాషా, రఫీక్, షాజహాన్ పాల్గొన్నారు.

యువ మహిళా క్రికెటర్ అనూషకు అభినందన



అనూషను సన్మానిస్తున్న ఎస్కేయూ వీసీ రామకృష్ణా రెడ్డి

అనంతపురం: అండర్-23 మహిళా క్రికెట్ వన్డే జట్టులో ప్రాతినిధ్యం వహించిన యువ మహిళా క్రికెటర్ బి. అనూషను ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి శుక్రవారం అభినందించారు. పీవీకేకే డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ చదువుతున్న అనూష అంతర్జాతీయ స్థాయి క్రికెట్‌లో రాణించడంపై వీసీ అభినందించారు. క్రికెట్‌లో రాణించి, పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎంవీ శ్రీనివాస్, కంప్యూటర్ సైన్సెస్ ప్రొఫెసర్ వి.రఘునాథ రెడ్డి, పీవీకేకే ప్రిన్సిపాల్ డాక్టర్ మునికృష్ణా రెడ్డి , నోడల్ ఆఫీసర్ వెంకటకుమార్ తదితరులు అభినందించారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

• సూపరింటెండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు



ఆస్పత్రిలో డైట్ వివరాలు ఆరాతీస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు

అనంతపురం క్రైం: సర్వజనాస్పత్రిలోని వివిధ వార్డుల్లో ఉన్న రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు హెచ్ఓడీలు, నర్సింగ్ సూపరింటెండెంట్, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం జీజీహెచ్‌లోని గైనిక్ విభాగానికి సంబంధించి గైనిక్, పోస్టునేటల్, లేబర్, చిన్నపిల్లల విభాగానికి సంబంధించి ఎస్ఎన్‌సీయూ, ఎన్ఆర్‌సీ, రక్తనిధి, ఎక్స్‌రే యూనిట్ తదితర వాటిని నిశితంగా పరిశీలించారు. ఆహారం సక్రమంగా ఇస్తున్నారా ?అని బాలింతలను సూపరింటెండెంట్ ఆరా తీశారు. బాలింతలు డిశ్చార్జ్ అయిన రోజే తాత్కాలిక ధ్రువీకరణ పత్రం అందించేలా చర్యలు తీసుకోవాలని గైనిక్ హెచ్ఓడీ డాక్టర్ షంషాద్‌బేగంను ఆయన ఆదేశించారు. రక్తనిధి కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆయన రక్తం ఎంత నిల్వ ఉందని, బ్యాగులు ఎన్ని ఉన్నాయని, పెథాలజిస్టుల సమయపాలనపై ఆరా తీశారు. ఆస్పత్రిలో పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక దృష్టిసారించాలని నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు, హెడ్ నర్సులను సూపరింటెండెంట్ ఆదేశించారు. ఎమర్జెన్సీ, అక్యూట్‌మెడికల్ కేర్, ఐసీయూ, తదితర అత్యవసర వార్డుల్లో రోజు ఆరు సార్లు, నాన్ అత్యవసర వార్డుల్లో మూడుసార్లు శుభ్రం చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సౌజన్య కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు, గ్రేడ్ 2 నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

గార్లదిన్నె: ఉన్న ఆశా వర్కర్లు సాంకేతికంగా పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ షమీన్ తాజ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో ఈ ఆశా యాప్‌పై ఆశా వర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ షమీన్ తాజ్ మాట్లాడుతూ ఆశాయాప్‌లో గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలు, అర్హత గల దంపతులు, నవజాత శిశువుల సేవలను 6 నెలల నుంచి 58 నెలల పిల్లలకు ఇచ్చే ఐరన్ ఫోలిక్ సిరప్, విటమిన్ ఏ ద్రావణం ఇచ్చే తేదీలను నమోదు చేయాలన్నారు.

వీరబ్బాయి సేవలు మరువలేనివి



డాక్టర్ వీరబ్బాయిని సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

అనంతపురం క్రైం: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వీరబ్బాయి సేవలు మరువలేనివని ప్రోగ్రాం ఆఫీసర్లు పేర్కొన్నారు. శుక్రవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి పదవీ విరమణ చేశారు. ప్రోగ్రాం ఆఫీసర్లు, వైద్యాధికారులు డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయిని సన్మానించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి మాట్లాడుతూ జిల్లాలో కొన్ని నెలలు పాటు పని చేసినా, ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి తన వంతు కృషి చేశామన్నారు. 1991లో రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా విధుల్లోకి చేరి వివిధ హోదాల్లో ప్రజలకు సేవలందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీసీపీఎన్‌డీటీ యాక్ట్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత, ఏఓ తారామోహన్ రావు, ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, డీఎల్ఏటీ డాక్టర్ మనోజ్, జిల్లా మలేరియా అధికారి డీ ఓబులు, డెమో ఉమాపతి, డిప్యూటీ డెమో త్యాగరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ గంగాధర్, ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ పాల్గొన్నారు.

డీఎంహెచ్‌గా యుగంధర్ బాధ్యతల స్వీకరణ: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిగా (ఎఫ్ఏసీ) డాక్టర్ యుగంధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి పదవీ విరమణ అనంతరం డాక్టర్ యుగంధర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్లు, వైద్యాధికారులు నూతన డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్‌కు పుష్పగుచ్ఛం అందించి, స్వాగతం పలికారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి



డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న డీటీసీ వీర్రాజు

తాడిపత్రి అర్బన్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నామని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ (డీటీసీ) వీర్రాజు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తాడిపత్రి ప్రాంతీయ రవాణా కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఎంవీఐ శ్రీనివాసులు, రాజగోపాల్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యాలయం ప్రాంగణంలోని డ్రైవింగ్ లైసెన్సు టెస్ట్‌ను డీటీసీ పరిశీలించారు. ట్రాక్ సక్రమంగా లేకపోవడంతో కొత్తది నిర్మించాలని సూచించారు. అనంతరం మార్కెట్ యార్డులోని పర్ఫెక్ట్ హెవీ డ్రైవింగ్ స్కూల్‌ను ఆయన పరిశీలించారు. అభ్యర్థులతో శిక్షణపై ఆరా తీశారు.

* మనం మాట్లాడుకోవాల్సిందే!


ప్రతీకాత్మక చిత్రం

అధునికత పేరుతో మన మధ్యలోకి డ్రగ్స్ అనే భూతాలు వచ్చాయి. పబ్ కల్చర్ పెరుగుతున్న ఈ రోజుల్లో అబ్బాయిలే కాదు అమ్మాయిలు కూడా డ్రగ్స్‌కు బానిసలవుతున్నారు. ఈ సమస్య బారిన పడకుండా ఉండాలన్నా, డ్రగ్స్‌కు అడిక్ట్ అయినా మనం మాట్లాడుకోవాల్సిందే!

డ్రగ్స్‌కు దూరంగా ఉందాం..!

'ఈ దశాబ్దం చివరి నాటికి, ప్రపంచవ్యాప్తంగా డ్రగ్స్ వాడేవారి మోతాదులో దాదాపు 11 శాతం పెరుగుదల ఉంటుంద'ని 'యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్' తన నివేదికలో పొందుపరిచింది. ఇది ఒక సామాజిక సమస్య. మత్తుకు బానిస కావడానికి కారణాలు వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులతో ముడిపడి ఉంటాయి. విద్య, వృత్తి, కుటుంబ ఆదాయం, జెండర్, సామాజిక పోకడలు.. అన్నీ వ్యసనానికి లొంగిపోయే వ్యక్తి ఆలోచనా విధానంపై ప్రభావం చూపుతాయి.

•••

బర్త్ డే పార్టీ అని వెళ్లిన కూతురు సోనీ (పేరు మార్చడమైనది) రాత్రి నుంచి ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వస్తోంది. తన స్నేహితులను కనుక్కుంటే తెలియదనే సమాధానం వచ్చింది. మూడు నెలలుగా సోనీ ప్రవర్తనలో వచ్చిన మార్పులు అమ్మను తెగ భయపెడుతున్నాయి. ఇదే విషయమై భర్తతో చెప్పింది. సోనీ వారికి ఒక్కతే కూతురు. అడిగినవన్నీ అమర్చిపెట్టగలిగే స్థోమత గల కుటుంబం.

సోనీ బీటెక్ సెకండియర్ చదువుతోంది. ఇంటర్మీడియెట్ వరకు ఇంట్లో ఎంత చెబితే అంత అన్నట్టుగా ఉన్న అమ్మాయి ఒక్కసారిగా ఫ్రెండ్స్ బర్త్ డే అనీ, గెట్ టుగెదర్ అనీ, కాలేజీ ఫ్రెషర్స్ డే అనీ, ఫేర్వెల్ అనీ... ఈ మధ్య పార్టీలు బాగా పెరిగిపోయాయి. పార్టీ అన్నప్పుడల్లా డబ్బులు ఇవ్వక తప్పేది కాదు. ఆమె రావడం ఆలస్యం కావడంతో ఓరోజు ఆమె ఫ్రెండ్స్ ద్వారా ఎంక్వైరీ చేసి, తను ఎక్కడ ఉందో తెలుసుకొని వెతుక్కుంటూ అక్కడికి వెళ్లారు.

అక్కడ సోనీ ఉన్న తీరును చూసి తల్లీతండ్రి షాకయ్యారు.

మరో నలుగురు అమ్మాయిలు, అబ్బాయిలు ఉన్నారు. మత్తులో ఉన్నట్టుగా కనిపిస్తున్నారు. అడిగిన దానికి ఎవరూ సరిగా సమాధానం చెప్పడం లేదు. వారి చుట్టూ ఉన్న వాతావరణం, వారి వాలకం చూడగానే అర్థమైపోయింది పిల్లలు ఎలాంటి స్థితిలో ఉన్నారో.

•••

సోనీని బలవంతంగా ఇంటికి తీసుకువచ్చారు.

నిద్రలేచి, ఫ్రెష్ అయి మళ్లీ బయటకు వెళ్లబోతున్న సోనీని ఆపింది తల్లి.

'బయట కాలు పెడితే ఊరుకోను, ఇంట్లోనే ఉండు' అని గద్దించాడు తండ్రి. .

'నన్ను ఆపడానికి మీరెవరు.. నా ఫ్రీడమ్‌ను ఎందుకు చంపేస్తున్నారు. ఏం చేస్తారో చేసుకోండి. నేను వెళతాను..' అని తండ్రి మీద రివర్స్ అయిపోయి బయటకు వెళ్లిపోయింది.

ఇక అలాగే వదిలేస్తే కూతురు దక్కదనుకున్నారు తల్లీదండ్రీ.

ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేంత దూరం సమస్యను తీసుకెళ్లకుండా మొదట్లోనే సరైన పరిష్కారం దిశగా అడుగులు వేయడం, నిపుణుల సలహాలు పాటించడం మేలు.


ప్రతీకాత్మక చిత్రం

కృత్రిమ ఆనందం

- డ్రగ్స్‌కు అలవాటు పడితే ఏం చెప్పినా వినరు. డబ్బులు ఇవ్వకపోతే దొంగతనం చేయడం, పెద్దవాళ్ల మీద చేయి చేసుకోవడం, ఇంకా చేయకూడని పనులు చేసి ఎలాగైనా సరే డ్రగ్స్ తీసుకుంటారు.
- వాళ్లకి వాళ్ల డ్రగ్స్‌కి మధ్యన ఎవరు వచ్చినా భరించరు. అంటే.. తల్లీ, తండ్రీ, స్నేహితులు... ఎవ్వరొచ్చినా తట్టుకోలేరు.
- యూత్‌కి బాగా నచ్చే పదాలు 'కొత్తదనాన్ని ఎక్స్‌పీరియెన్స్ చేయాలి.' దీనివల్లే ప్రతీ డ్రగ్ ని ఎక్స్‌పీరియన్స్ చేయాలనే క్యూరియాసిటీతో వాటిని టేస్ట్ చేస్తారు. ఆ సమయంలో కలిగే 'కృత్రిమ ఆనందం' మళ్లీ మళ్లీ మరింత మత్తు కావాలని కోరుకుంటుంది. దీంతో మోతాదు పెరుగుతుంటుంది.

సైకిక్ ఎనర్జీ

'నా జీవితం ఇది. నాకు చెప్పడానికి నీవెవరు? కన్నావు కాబట్టి భరించాల్సిందే' అంటారు. పరువు, ప్రతిష్ఠ, చదువు, కెరియర్.. దేనికీ వాల్యూ ఇవ్వరు. సైకిక్‌లా ప్రవర్తిస్తారు. ఇందులో అబ్బాయిలు/అమ్మాయిలు ఇద్దరూ ఉన్నారు. ఇది డ్రగ్ ఎడిక్షన్ పర్యవసానం అనే నిజాన్ని కుటుంబ సభ్యులు జీర్ణం చేసుకోలేకపోతున్నాయి. మా పిల్లలు అలాంటివారు కాదు అనుకొని సమాధాన పరుచుకుంటారు.

కౌన్సెలింగ్ తప్పనిసరి

తాము ముందు అనుకున్న లక్ష్యాలను పక్కన పెట్టేసి, ఇలాంటి వాటికి పిల్లలు అట్రాక్ట్ అవుతుంటారు. అందుకని, అమ్మాయి/అబ్బాయి ఎవరైనా సరే మత్తు పదార్థాలకు సంబంధించిన ప్రతీ సిచ్యుయేషన్ ని డిస్కస్ చేయాల్సిందే. 'మా అమ్మాయి/అబ్బాయి ఇలా చేస్తుంటే పదిమందికి ఏమని చెప్పుకుంటాం. ఈ సమస్యకు ఎవరి దగ్గరకు వెళ్లాలో కూడా తెలియడం లేదు' అని కుమిలిపోతుంటారు. దీనికి సరైన పరిష్కారం సైకలాజికల్ కౌన్సెలింగ్.

– నిర్మలారెడ్డి

అనుమానించాల్సిందే!

పిల్లల కొన్ని చర్యల వల్ల వాళ్లు డ్రగ్ అడిక్ట్ అవునా కాదా సులువుగా తెలుసుకోవచ్చు.

- ఎక్కువ డబ్బులు కావాలని అడుగుతుంటారు. తరచూ పార్టీలకు వెళ్లడం, నా రూమ్‌లోకి ఎవరూ రావద్దు ... అని ఐసోలేట్ అవుతుంటారు. రెబల్స్ అవుతారు/రివర్స్ అవుతారు. పగటిపూట పడుకోవడం, రాత్రిళ్లు మేల్కోవడం చేస్తుంటారు. పెదవులు ఆరిపోవడం, చూపులో తేడా రావడంతోపాటు, వారి బాడీ లాంగ్వేజ్‌లోనూ మార్పులు వస్తాయి. ఇంట్లోకి వచ్చిన వెంటనే రూమ్‌లోకి వెళ్లి, తలుపులు వేసేసుకున్నా, నాకు వేరే పని ఉంది, నేను ఇప్పుడే రాను.. లాంటి మాటలు మాట్లాడుతున్నా అనుమానించాల్సిందే. చదువు విషయంలో సరిగ్గా లేకున్నా చెక్ చేయాలి. సరైన గైడెన్స్ ఇప్పించాలి. ఎక్కడైనా తేడా వస్తే.. థెరపిస్ట్ దగ్గరకు తీసుకెళ్లాలి.
- నా జీవితం, నా స్వేచ్ఛ అనే భావన అమ్మాయిలకు/అబ్బాయిలకు వచ్చేసింది. కానీ, స్వేచ్ఛ ఎంత ఇవ్వాలో దానికో పరిమితి ఉండాలి. ఏడాది, రెండేళ్ల పిల్లలు వెలుగుతున్న క్యాండిల్‌ను పట్టుకోవడానికి ఉత్సాహం చూపుతారు. కాలుతుందని మనకు తెలుసు, ఆ పిల్లవాడికి తెలియదు. అలాంటప్పుడు మనం ఎలా ఆపుతామో, ఇదీ అంతే అని గుర్తించాలి. నా పిల్లలను నేను కంట్రోల్ చేయాల్సిందే.. అనుకున్నప్పుడు మానిటర్ చేయాల్సిందే. అందుకు తగిన సపోర్ట్ తీసుకోవాల్సిందే.
- మంచి జీవనశైలి గురించి చెబితే ఎవరూ వినరు. వారి ఆలోచనా విధానమే మారాలి. ఎప్పుడూ మోటివేట్ చేసుకుంటూ వెళ్లాలి. అప్పుడు మంచి ఫలితం వస్తుంది. శారీరకంగా దెబ్బతినడం, కెరియర్ పాడవడం, సామాజికంగా చెడు పేరు రావడం ఇలాంటివన్నీ సమస్యలే కాబట్టి ఆలోచనా విధానాన్ని మార్చేటట్టు చేయాలి. అయితే, ఆలోచనా విధానం మారడానికి మందులు ఉండవు. ఉదాహరణకు.. ఐస్‌క్రీమ్ తింటే పడటం లేదు అంటే, తినడం మానేయాలి, తప్పదు. అలాగే, మనకు చెడు చేసేవి ఏవైనా వదిలేయాల్సిందే.
- మత్తు పూర్తిగా వదిలించుకోవాలంటే అది ఆ వ్యక్తిని బట్టి ఉంటుంది. మారాలనే ఆలోచన బట్టి రికవరీ వేగంగా ఉంటుంది. 'డ్రగ్స్ వల్ల నాకు డ్యామేజీ అవుతుంది అనుకున్నప్పుడు పరిష్కారాన్ని వెతుక్కోవాలి అనిపిస్తుంది. ఆల్కహాల్/డ్రగ్స్ తీసుకుంటే బాడీ వెంటనే రియాక్ట్ అవుతుంది. ఒక్కసారిగా మానేసినా అంతే రియాక్ట్ అవుతుంది. అందుకని, డిటాక్స్ అండ్ విత్‌డ్రాయల్ మేనేజ్‌మెంట్ చేయాల్సి ఉంటుంది. మత్తుకు అలవాటుపడటం ఒక రోగం అని గుర్తించాలి. దాని మీద ఒక అవగాహన ఏర్పరుచుకోవడం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కౌన్సెలింగ్ విధానాల ద్వారా దాన్ని అధిగమించాలి.



– డాక్టర్ గిడియన్, డి-అడిక్షన్ థెరపిస్ట్
లివింగ్ సోబర్, హైదరాబాద్

నాలుగైదేళ్లొచ్చినా ఇంకా ముద్దు ముద్దుగా మాట్లాడే పిల్లలే మనకు తెలుసు. అలాంటిది రెండేళ్లకే గలగల మాట్లాడుతూ అందరూ ఆశ్చర్యపోయేలా చేశాడా బుడతడు. అంతేనా? తొమ్మిదో ఏటనే "నాది స్కూలు సిలబస్ చదివి, హోం వర్క్ చేసే వయసు కాదు" అని చెప్పి ఏకంగా కాలేజీ పుస్తకాలు చేతబట్టాడు. నాలుగేళ్లలో చకచకా డిగ్రీ పూర్తి చేసేశాడు. ప్రస్తుతం పద్నాలుగేళ్ల వయసులో ఎలాన్ మస్క్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా హోర్దాగా పని చేస్తున్నాడు కైరాన్ క్వాజీ.

పద్నాలుగేళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్!


కైరాన్ క్వాజీ

నేటి టెక్నాలజీ టీనేజర్స్ కొందరు అది ఇది అనిచెబుతూ ఎంజాయ్ చేస్తూ సమయాన్ని వృథా చేస్తుంటే.. కైరాన్‌లాంటి కుర్రాళ్లు మాత్రం వయసుకు మించిన ప్రతిభతో అద్భుతాలు సృష్టిస్తూ ఔరా అనిపిస్తున్నారు. అత్యంత వేగం, కచ్చితత్వంతో కూడిన ప్రతిభా పాటవాలతో ప్రఖ్యాత స్పేస్ ఎక్స్ కంపెనీ రిక్రూట్‌మెంట్ టెస్ట్ పాసైన కైరాన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికవడమేగాక, కంపెనీలోనే తొలి అతిపిన్న ఇంజినీర్‌గా నిలిచాడు.

అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోకు చెందిన జూలియా, ముస్తాహిద్ క్వాజీ దంపతులకు 2009 జనవరి 27 కైరాన్ పుట్టాడు. చిన్నప్పటి నుంచి ఎంతో చురుకుగా ఉత్సాహంగా ఉండే కైరాన్‌ను గమనించిన తల్లిదండ్రులు.. చక్కగా ప్రోత్సహించేవారు. తెలివిగా చదువుతూ ..ఏడో ఏట యంగ్‌వాంక్స్ కోడింగ్ అకాడమిలో చేరి పైథాన్ ప్రోగ్రామింగ్‌ను నేర్చుకున్నాడు. దీంతోపాటు మెషిన్ లెర్నింగ్‌ను కూడా వంటబట్టించుకున్నాడు.


విధి నిర్వహణలో క్వాజీ


తల్లిదండ్రులతో...

తొమ్మిదేళ్లకే కాలేజీ..

నాది స్కూల్ హోం వర్క్ చేసే వయసు కాదని తన ప్రతిభతో తొమ్మిదో ఏటనే లాస్‌పాసిటాస్ కాలేజీలో చేరి ఈ కాలేజీ చరిత్రలో తొలి పిన్న వయసు విద్యార్థిగా చరిత్ర సృష్టించాడు. ఆ తరువాత పదకొండేళ్లకే మ్యాథమేటిక్స్‌లో డిగ్రీ చదువుతూనే శాంత క్లారా యూనివర్శిటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ కూడా చదివాడు. ఇదే యూనివర్శిటీలో ఈ ఏడాది మాస్టర్స్‌ని పూర్తిచేశాడు. ఇటీవల సాంకేతిక ఫన్ ఇంటర్వ్యూ ప్రాసెస్‌ను అవలీలగా అధిగమించి స్పేస్ఎక్స్‌లోని స్టార్‌లింక్ విభాగంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికయ్యాడు. దేన్నైనా ఇట్టే పట్టేసే గుణగణాలే కైరాన్‌ని స్పేస్ ఎక్స్ ఉద్యోగిగా మార్చాయి. అందుకే చిన్న వయసులో డిగ్రీలేగాదు, ఉద్యోగాన్ని కూడా కొట్టేశాడు.

ప్రతిభ, పట్టుదల, కృషి ఎక్కువ

''కైరాన్ చిన్నప్పటి నుంచి చాలా చురుకుగా ఉండేవాడు. అ చురుకుదనాన్ని వెన్నుతట్టి ప్రోత్సహించేవాళ్లం. దాంతో వాడు తన ప్రతిభాపాటవాలకు మరింత పదును పెట్టుకుని టీనేజ్‌లోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా మారాడు. లాస్‌పాసిటాస్ కాలేజీలో చదివేటప్పుడు అకడమిక్ సిలబస్‌ను నేర్చుకోవడమేగాక, స్టాఫ్ అసిస్టెంట్‌గా, స్టెమ్ ట్యూటర్‌గాను పనిచేసేవాడు. ఇతర ట్యూటర్‌లకు సాయం చేస్తూ తన నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాడు. వేసవి సెలవుల్లో సైబర్ ఇంటిలిజెన్స్ ఇంటర్న్‌షిప్ చేశాడు. దీనితోపాటు బ్లాక్‌బర్డ్ ఏఐలో కూడా ఏఐ ఇంటర్న్‌గా చేశాడు. శాంతక్లారా యూనివర్సిటీ, ఇంటెల్ మెంటర్స్ కూడా కైరాన్‌కు మంచి గైడెన్స్‌ను అందించారు. చేతిరాత, స్పెల్లింగ్, నోట్ టేకింగ్, ఇతర భాషలు నేర్చుకోవడం కాస్త కష్టమైనా.. పట్టుదల, కృషితో నేర్చుకున్నాడు. ప్రస్తుతం బెంగాలీ, మాండరిన్ నేర్చుకుంటున్నాడు. ఎప్పుడు కొత్తదాన్ని నేర్చుకోవడానికి కైరాన్ ఆసక్తి కనబరుస్తాడు. ఆ ఆసక్తే వాడి భవిష్యత్తుని ఉజ్వలంగా తీర్చిదిద్దుతోంది'' అని కైరా తల్లిదండ్రులు చెప్పుకొచ్చారు.

" నా నెక్ట్స్ స్టాప్ స్పేస్ఎక్స్: ఈ గ్రహంలోనే అత్యంత చక్కని కంపెనీలో స్టార్‌లింక్ ఇంజినీరింగ్ టీమ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేరబోతున్నాను. వయసును బట్టి ఉద్యోగాలలో నియమించే కంపెనీలకు భిన్నంగా, నా ప్రతిభ, పరిపక్వతలను దృష్టిలో పెట్టుకుని స్పేస్ఎక్స్ నాకు ఈ ఉద్యోగం ఇచ్చింది" అని తన లింక్డ్ ఇన్ అకౌంట్ ద్వారా కైరాన్ తన కలల జాబ్ గురించి సంతోషంతో చెప్పుకున్నాడు.

న్యూస్‌మేకర్


సాబ్రి

మరో స్వర్ణకమలం

సంప్రదాయ నృత్యమంటే ఇష్టం లేని అమ్మాయిని ఆ నృత్యంలో లగ్నం చేసే సినిమా కథ 'స్వర్ణకమలం'. కేరళలో ఇందుకు పూర్తి విరుద్ధమైన కథ జరిగింది. మదరసాలో చదువుకునే ఒక అమ్మాయి కథాకళి పట్ల ఆసక్తితో 80 ఏళ్ల చరిత్ర ఉన్న డాన్స్ స్కూల్‌లో పోరాడి సీటు సాధించుకుంది. కథాకళిలో ముస్లిం అమ్మాయిల ప్రవేశం ఇప్పటి వరకూ లేదు. ఆ నృత్యం నేర్చుకుంటున్న మొదటి అమ్మాయి సాబ్రి.

'చిన్నప్పటి నుంచి కథాకళి చూస్తున్నా. దానికి వేసుకునే మేకప్, దాని కాస్ట్యూమ్స్, ఆ నృత్యవిధానం నన్ను ఆకర్షించాయి. ఎలాగైనా ఆ డాన్స్ నేర్చుకోవాలని చెప్పా. నాన్నకు కూడా ఆ డాన్స్ ఇష్టం. సరే నమ్మా అన్నాడు' అంది సాబ్రి.

ఏడవ క్లాసు పూర్తి చేసిన సాబ్రి ఇప్పుడు తండ్రి నిస్సమ్, తల్లి అనీషాల ప్రోత్సాహంతో కథాకళి నృత్యం నేర్చుకోవడానికి పూనుకుంది. కేరళలోనే కాదు బహుశా దేశంలోనే కథాకళి నేర్చుకుంటున్న తొలి ముస్లిం బాలిక సాబ్రి. అందుకే ఈ అమ్మాయిని అందరూ మెచ్చుకుంటున్నారు. కళకు కులం, మతం భేదం లేదని అంటున్నారు.


డ్యాన్స్ స్కూల్ 'కళామండలం' వద్ద సాబ్రి


డ్యాన్స్ క్లాస్‌లో ...

■ దేవుని గుడిలో చూసి..

సాబ్రి కుటుంబం కొల్లంలో నివసిస్తుంది. తండ్రి నిస్సమ్ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్. వీరి ఇంటి సమీపంలోనే శ్రీ మహదేవ కోవెల ఉంది. అక్కడ దాదాపు ప్రతి వారం ఏదో ఒక సాయంత్రం కథాకళి నృత్య ప్రదర్శన ఉంటుంది. వృత్తిలో భాగంగా నిస్సమ్ ఆ నృత్య ప్రదర్శన ఫొటోలు తీయడానికి వెళ్లేవాడు. కాలక్షేపంగా ఉంటుందని సాబ్రిని కూడా తీసుకెళ్లేవాడు. 'అలా ఏడేళ్ల వయసు నుంచే నేను కథాకళి నృత్యాన్ని చూస్తున్నాను. ఐదో క్లాసు అయ్యాక ఆ డాన్సును ప్రయివేటు టీచర్ దగ్గరి నుంచి నేర్చుకోవాలనుకున్నాను. కాని కోవిడ్ వల్ల క్లాసులు ఆగిపోయాయి. అదీగాక ఒక ఇన్‌స్టిట్యూట్ నుంచి పరిపూర్ణంగా నేర్చుకోవాలనిపించింది. అందుకే కళామండలంలో చేరాను' అంది సాబ్రి.

■ మగవారికే కథాకళి

కథాకళి నృత్యం ఒక తపస్సు. దాని కోసం జీవితాన్ని అంకితం చేయాలి. స్త్రీల శరీర ధర్మాలు, గృహ ధర్మాలు వారిని పరిపూర్ణంగా ఈ నృత్యంలో నిమగ్నం కాని వ్వవు అనే ఉద్దేశ్యంతో ఈ నృత్యాన్ని ఆది నుంచి పురుషులకే పరిమితం చేశారు. పురుష కళాకారులే కథాకళిలోని స్త్రీల వేషాలను కూడా ధరిస్తారు. ప్రదర్శనను రక్తి కట్టిస్తారు. కథాకళిని పరిరక్షించడానికి కేరళలో ప్రతిష్ఠాత్మకమైన డాన్స్ ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నాయి. అలాంటి వాటిలో ముఖ్యమైనది త్రిసూర్‌కు దగ్గరగా ఉన్న చెరుతురితి అనే ఊరిలోని 'కళామండలం'. ఇది కథాకళిని బాల్యం నుంచి రెసిడెన్షియల్ పద్ధతిలో నేర్పుతుంది. అంటే ఇక్కడ మామూలు స్కూలు, కథాకళి స్కూలు కలిసి నడుస్తాయి. 90 ఏళ్లుగా నడుస్తున్న ఈ సంస్థలో పూర్తిగా అబ్బాయిలకే ప్రవేశం. అయితే గత సంవత్సరమే అమ్మాయిలు కూడా చేరొచ్చు అని అనుమతి ఇచ్చారు. ఎవరూ చేరలేదు. ఈ సంవత్సరం పది మంది అమ్మాయిలు చేరితే వారిలో ఒకమ్మాయి సాబ్రి.

■ కఠిన శిక్షణ

కళామండలంలో 8 వతరగతిలో చేరిన సాబ్రి ఇక అక్కడే హాస్టల్‌లో ఉండిపోవాలి. ఉదయం 4.30 నుంచి లేచి కథాకళి పాఠాలు నేర్చుకోవాలి. 9.30 నుంచి మళ్లీ స్కూలు పాఠాలు నేర్చుకోవాలి. సాయంత్రం ఊళ్లో ఎక్కడ కథాకళి ప్రదర్శన జరుగుతుంటే అక్కడకు తీసుకెళ్లి చూపిస్తారు. 'కథాకళిలోని ప్రదర్శనలన్నీ హిందూ పురాణాల ఆధారంగా ఉంటాయి. మరి నీకు ఆ పాత్రలు పోషించడంలో ఇబ్బంది ఏమీ లేదా' అంటే 'అలా ఏమీ లేదు' అంటుంది సాబ్రి. తండ్రి నిస్సమ్ కూడా 'మా అమ్మాయి డాన్స్ నేర్చుకోవడంలో కళ అందరూ నేర్చుకునే హక్కు నిరూపితం అయ్యింది. ఈ నృత్యం నేర్చుకోవడంలో మా మతస్తుల నుంచి ఎటువంటి అభ్యంతరం లేదు' అని తెలిపాడు.

నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్ఎస్‌డీ) స్టూడెంట్ అయిన ఆష్క గొరాదియకు బాలీవుడ్‌లో బ్రేక్ రాలేదు. అయితే ఆ అసంతృప్తి ఆమె మాటల్లో ఎప్పుడూ తొంగి చూసేది కాదు. ప్రతి అడుగులో ఆత్మవిశ్వాసం కనిపించేది. ఆ ఆత్మవిశ్వాసమే ఆమెను వ్యాపార రంగం వైపు నడిపించింది. 'రెనీ కాస్మెటిక్స్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఘనవిజయాన్ని సాధించింది...

ది బాస్ లేడీ


ఆష్క గొరాదియ

బాల నటిగా కెరీర్ మొదలు పెట్టింది ఆష్క గొరాదియ. తన ప్రయాణంలో రకరకాల సవాళ్లు, కష్టాలు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. వాటివల్ల పోరాటం ఎలా చేయాలో తనకు తెలిసింది. హిందీ సినిమాల్లో నటిస్తున్న కాలంలోనే హాలీవుడ్ కలలతో అమెరికా వెళ్లింది. అక్కడ పెద్దగా అవకాశాలు రాకపోవడంతో తిరిగి ఇండియాకు వచ్చింది.

బాలీవుడ్ సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసి, ఎన్నో టీవీ సీరియల్స్‌లో నటించి 'టీవీ స్టార్'గా పేరు తెచ్చుకున్న ఆష్క ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం మొదలుపెట్టాలనుకుంది. అయితే అది అంత తేలిక కాదనేది తనకు తెలియని విషయమేమీ కాదు. తన కళ్ల ముందే ఎన్నో అనుభవాలు ఉన్నాయి. అయితే అవేమీ తనకు అడ్డు కాలేదు. మొదటి అడుగుగా సొంతంగా ప్రొడక్షన్ కంపెనీ మొదలుపెట్టిన ఆష్క ఎన్నో సక్సెస్‌ఫుల్ టీవీ షోలు చేసింది. ఆ తరువాత ట్రావెలర్స్ కోసం ఒక మొబైల్ యాప్ వెంచర్‌ను లాంచ్ చేసింది. ఆ తరువాత స్నేహితులతో కలిసి ప్రారంభించిన 'రెనీ కాస్మెటిక్స్' ఆమెను స్టార్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చింది.

ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఆష్క ఘనవిజయం ఎంతోమంది ఔత్సాహికులకు స్ఫూర్తి ఇచ్చింది. ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనుకునే వారికి ఆమె చెప్పిన కొన్ని సలహాలు...

కల కనాలి... ముందుకు కదలాలి: ఒకరి నుంచి స్ఫూర్తి పొందిన తరువాత కల శ్రీకారం చుట్టుకుంటుంది. అయితే అది సాకారం కావాలంటే ఆచరణలోకి రావాలి. పనికి సంబంధించి స్థాయిని పెంచుకుంటూ పోవాలి.

అంకితభావం ప్లస్ కష్టం: నటన అయినా వ్యాపారమైనా సక్సెస్ కావాలంటే అంకితభావంతో పాటు బాగా కష్టపడాలి. ఒకవేళ విజయం సాధించకపోయినా మనం కన్న కలకు దూరం కావద్దు. ఓటమి నేర్పే పాఠాలతో ముందుకు వెళ్లాలి. సానుకూల ఆలోచనలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

రిస్క్‌కు భయపడితే రిస్క్: ఈతకొట్టడానికి నీళ్లలోకి దిగిన తరువాత నీళ్లకు భయపడితే ఎలా! వ్యాపారం అన్నాక రిస్క్ ఉంటుంది. అంత మాత్రాన వెనక్కి తగ్గనవసరం లేదు. మూస ఆలోచనలకు భిన్నంగా కొత్తగా ఆలోచిస్తే విజయం మన చెంతకు నడిచొస్తుంది.



కోవిడ్ కల్లోల సమయంలో ఎన్నో వ్యాపారాలలాగే మా వ్యాపారం కూడా దెబ్బతింది. 'ఇక నీకు నటనే దిక్కు' అనేవాళ్లు. అయితే నేనెప్పుడూ నమ్మకం కోల్పోలేదు. మంచిరోజులు వస్తాయని గట్టిగా నమ్మాను. అది నిజమైంది.

నెట్‌వర్క్: నటనకైనా, వ్యాపారానికైనా పదిమందితో పరిచయం ముఖ్యం. ఈవెంట్స్, వర్క్‌షాప్‌లకు హాజరుకావడంతో పాటు ఆన్‌లైన్ కమ్యూనిటీలతో టచ్‌లో ఉండాలి. సామాజిక సంబంధాల ద్వారా కొత్త విషయాలు తెలుస్తాయి. ఆలోచన పరిధి విస్తరిస్తుంది. ముందుకు వెళ్లడానికి కావాల్సిన ధైర్యం లభిస్తుంది.

యుఎస్‌పీ: 'మా బ్రాండ్ ఇది' అని మాత్రమే కాదు 'మా యూఎస్పీ ఇది' అని గర్వంగా చెప్పుకోగలగాలి. మా బ్రాండ్ విషయానికి వస్తే హై-క్వాలిటీ, గతంలో ఎప్పుడూ చూడని ప్యాకేజీ, పాకెట్-ఫ్రెండ్లీ ప్రైస్ అనేవి మా యూఎస్పీ. మార్కెట్ ప్లేస్‌లకు వెళుతూ ఎప్పటికప్పుడు ట్రెండ్స్ తెలుసుకోవాలి.

ఆష్కకు నటన, యోగా, పోల్ డ్యాన్స్, ట్రావెల్ అంటే ఇష్టం. ఇక ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనేది వాటికంటే రెండు రెట్లు ఎక్కువ ఇష్టమైనది. సినిమాలు, టీవీ సీరియల్స్‌లో ఆష్క 'బిజినెస్ ఉమన్' పాత్ర ధరించలేదు. అయితే నిజ జీవితంలో మాత్రం ఆమె 'బిజినెస్ ఉమన్'గా అద్భుత విజయాన్ని సాధించింది. 'ది బాస్ లేడీ' అని స్నేహితులతో పిలిపించుకుంటోంది.